

ముగిసిన గంధోత్సవం వేడుకలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణంలో మూడు రోజులపాటు జరిగిన ఉరుష్ షరీఫ్ గంధోత్సవం వేడుకలు సోమవారంతో ఘనంగా ముగియి. స్థానిక పాత పెద్దాపురంలోని హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా షార హమత్ తుల్లా ఔలియా వార్ల గంధోత్సవం వేడుకలు ఈనెల 20 నుంచి ప్రారంభం అయ్యాయి. సోమవారం ముగింపు ఉత్సవంలో దర్గా వద్ద మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు మహమ్మద్ లాయక్ ఆలీ, బొడ్డు బంగారు బాబు, బాబులాల్, ఆశిక్ ఆలీ, అబ్దుల్ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న ముస్లిం పెద్దలు

ఎంతటి నిర్బంధాలైనా ఎదుర్కొంటాం

- కొనసాగుతున్న అంగన్వాడీల ఆందోళన
- 42 రోజులుగా సడలని దీక్షతో పోరాటం
- బయపెట్టాలని చూస్తున్న ప్రభుత్వం
- వెనక్కి తగ్గమంటున్న వర్కర్లు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సమ్మెలో ఉన్న కార్యకర్తలు సోమవారం అంగన్‌వాడీ సెంటర్లను తెరవకపోతే వారందరినీ విధుల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం ఇప్పటికే హెచ్చరించింది. ఈ మేరకు జిల్లాల కలెక్టర్లు ఆదివారమే ఉత్తర్వులు జారీ చేశారు. సెంటర్లు తెరవని వారి వివరాలను సేకరిస్తున్నారు. ఇదే సందర్భంలో ప్రభుత్వ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో విజయవాడలో నిరసన ప్రదర్శనలకు దిగారు. అలాగే జిల్లాలో కూడా ఇక్కడే ఉండి కొంతమంది సమ్మెను కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో వివిధ ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీలు ఆందోళనలో కొనసాగుతున్నారు. ప్రభుత్వం విధులు నుంచి తొలగిస్తామని హెచ్చరిస్తున్నా ఇటువంటి తాటాకు చప్పుళ్ళకు భయపడేది లేదంటూ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. సోమవారానికి 42 రోజుకి సమ్మె చేరుకుంది.

కాకినాడ జిల్లాలో 1817 మంది అంగన్‌వాడీ కార్యకర్తలుండగా వీరిలో 58 మంది మినీ వర్కర్లున్నారు. అలాగే 1774 హెల్పర్లు కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా 42 రోజులుగా సమ్మెలో కొనసాగుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విధుల్లోకి చేరని అందరికీ తొలగిస్తున్నట్లు నోటీసులను రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిస్తున్నామని ఐసిడిఎస్ పిడి కె.ప్రవీణ తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద నోటీసులను అతికిస్తామన్నామన్నారు. ఇదిలా ఉండగా చట్టబద్ధంగా నోటీసులు ఇచ్చిన తర్వాతే సమ్మెలోకి దిగిన మమ్మల్ని చర్చలు పేరుతో పిలిచి బెదిరింపు ధోరణి ప్రదర్శించిన ప్రభుత్వ తీరుపై జిల్లా అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు వర్తించని ఎస్మాను సైతం ప్రయోగించి మరింత బెదిరించాలని చూసిన ప్రభుత్వానికి చుక్కెదురైందన్నారు. అయినా బెదరకుండా అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగిస్తున్నారు. ఎలాగైనా సమ్మెను విచ్చిన్నం చేయాలని చూసినా అదరకుండా, బెదరకుండా పట్టు వదలని విక్రమార్కుల్లా ఆందోళన బాటలోనే ఉన్నారు. చివరకు చేసేదేమీ లేక ఉద్యోగాల నుంచి తొలగిస్తామని మరో బెదిరింపుకు దిగడం దుర్మార్గమని సిఐటియు నాయకులు తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని న్యాయబద్ధంగా కోరుతుంటే ప్రభుత్వం వ్యవహరిస్తున్న మొండి వైఖరిపై పలువురి అంగన్‌వాడీల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

గండేపల్లిలో ఆదివారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని తహశీల్దార్ కార్యాలయం ఆరుబయట ఉన్న అంగన్‌వాడీలు

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు క్షేత్రస్థాయిలో విశేష సేవలు అందిస్తున్న మేమంతా పని భారంతో తీవ్ర స్థాయిలో సతమతమవుతున్నా కష్టానికి తగిన వేతనం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. పెరిగిన ధరలు అనుగుణంగా వేతనాలు పెంచమని అడుగుతుంటే ప్రభుత్వం నిర్బంధాలను విధించడం సరికాదు. ప్రభుత్వం వెంటనే మా సమస్యలను పరిష్కరించాలి.

–వై.మంగాదేవి, అంగన్‌వాడీ కార్యకర్త, తిప్పరాజుపాలెం,

పోరాటం ఆగదు

మేము అడిగిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు మా పోరాటం ఆగదు. ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఉత్తర్వులు ఇస్తే న్యాయపోరాటం కూడా చేస్తాం. సామరస్య పూర్వకంగా ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నాం.

-సుగుణవతి, లేంగన్‌వాడీ కార్యకర్త, కంచర్లపేట, కాకినాడ

అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటు

42 రోజులుగా శాంతియుతంగా ఆందోళనలు చేస్తుంటే భయపడిన ప్రభుత్వం మమ్మల్ని అక్రమంగా అరెస్టులు చేయిస్తుంది. అర్ధరాత్రి కూడా స్టేషన్‌లో నిర్బంధించి భయపెట్టాలని చూశారు. కనీసం తాగునీరు కూడా ఇవ్వలేదు. అరెస్టులు సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదు. –కె.సత్యవేణి, అంగన్‌వాడీ కార్యకర్త, రాగంపేట, కాకినాడ

నియామకాలు చేపడితే అడ్డుకుంటాం

అక్రమంగా మమ్మల్ని తొలగించి ఈనెల 25వ తేదీ నుంచి మా స్థానాల్లో కొత్తగా నియామకాలు చేపడతామని ప్రభుత్వం హెచ్చరిస్తుంది. ఖచ్చితంగా నియామకాలు అడ్డుకుని తీరతాం. ప్రభుత్వం నిర్లక్ష్య మొండి వైఖరిని వదిలించి మా సమస్యలకు పరిష్కారాన్ని సాధించుకుంటాం.

- తలాటం వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, కాజులూరు

అలాంటి అధికారం ప్రభుత్వానికి లేదు

గౌరవ వేతనాలతో పనిచేస్తున్న మమ్మల్ని తొలగించే అధికారం ప్రభుత్వానికి లేదు. ఎస్మా కూడా వర్తించదు. ఇవన్నీ తెలియకుండానే ప్రభుత్వం మాపై బెదిరింపులకు దిగుతుండడం శోచనీయం. న్యాయ బద్ధమైన డిమాండ్లను అడుగుతుంటే అణచివేయాలని చూస్తే ఊరుకోం

- ఎస్ఎస్ఎస్.కుమారి, అంగన్‌వాడీ కార్యకర్త, కరప

అక్రమంగా తొలగిస్తే ఊరుకోం

సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ చివరకు మమ్మల్ని అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తుంది. కనీస వేతనాలు అమలు చేయకపోగా తెలంగాణ కంటే రూ.1000 అదనంగా ఇస్తామన్న సిఎం హామీని అమలు చేయమని కోరుతుంటే ఇలా ఇబ్బందులకు గురిచేయడం సరికాదు.

- దడాల సరోజిని, అంగన్‌వాడీ కార్యకర్త, కోలంక, కాజులూరు మండలం.

జిల్లా ఓటర్లు 15,99,065 మంది

-7,88,105 మంది పురుషులు, 8,10,781 మంది స్త్రీలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లాలో 15,99065 మంది ఓటర్లుగా నమోదు అయినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 తుది జాబితాను సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితా ప్రకారం జిల్లాలోని 1,637 పోలింగ్ కేంద్రాల్లో 15,99,065 మంది ఓటర్లుగా నమోదు అయ్యాయన్నారు. ఇందులో 7,88,105 మంది పురుష ఓటర్లు, 8,10,781 మంది స్త్రీ ఓటర్లు, 179 మంది ఇతరులుగా ఉన్నారని తెలిపారు. జిల్లాలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల నమోదును పరిశీలిస్తే తుని నియోజకవర్గంలోని 223 పోలింగ్ కేంద్రాలలో 1,09,052 పురుషులు, 1,11,800 స్త్రీలు, 25 మంది ఇతరులు మొత్తం 2,20,877 మంది ఉన్నారన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 227 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,05,412 మంది పురుషులు 1,082,027 మంది స్త్రీలు, 20 మంది ఇతరులు మొత్తం– 2,13,639 ఓటర్లుగా నమోదు అయ్యారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో 242 పోలింగ్ కేంద్రాలలో 1,15,223 మంది పురుషులు, 1,14,819 మంది స్త్రీలు, 4 మంది ఇతరులు మొత్తం– 23,0046 మంది ఓటర్లుగా ఉన్నారు. కాకినాడ రూరల్ నియోజక వర్గంలోని 264 పోలింగ్ కేంద్రాలలో 1,29,584 మంది పురుషులు, 1,31,591 మంది స్త్రీలు, 11 మంది ఇతరులు మొత్తం 2,61,186 మంది ఓటర్లుగా నమోదయ్యారు. పెద్దాపురం నియోజక వర్గంలోని 200 పోలింగ్ కేంద్రాలలో 1,04,446 మంది పురుషులు,1,07,478 మంది స్త్రీలు, 13 మంది ఇతరులు మొత్తం 2,11,937 మంది ఓటర్లు ఉన్నారు. కాకినాడ సిటీ నియోజకవర్గం లోని 233 పోలింగ్ కేంద్రాలలో 1,13,177 మంది పురుషులు, 1,23,166 మంది స్త్రీలు, 94 మంది ఇతరులు మొత్తం 2,36,437 మంది ఓటర్లుగా నమోదు అయ్యారు. జగ్గంపేట నియోజకవర్గంలోని 248 పోలింగ్ కేంద్రాలలో 1,11,211 మంది పురుషులు, 1,13,720 మంది స్త్రీలు ,12 మంది ఇతరులు మొత్తం 2, 24,943 మంది ఓటర్లుగా నమోదయ్యారు. జిల్లాలు అక్టోబర్ 27న ప్రచురించిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటికి మొత్తం కాకినాడ జిల్లాలో 15,89,755 మంది ఓటర్లుగా నమోదు కాగా అందులో 70,478 మందిని అదనంగా ఓటర్లుగా నమోదు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఇందులో 11510 మంది చనిపోయారని, 41958 మంది వేరే ప్రాంతాలకు వెళ్లారని, 7,700 మంది డబుల్ ఓటర్లుగా గుర్తించగా 61,168 మంది ఓటర్లను తొలగించడం జరిగిందన్నారు. ఎస్ఎస్ఆర్–2024 రూపకల్పనలో 28,471 యొక్క సవరణలు చేయగా మొత్తం జిల్లాలో 15 లక్షల 99వేల 065 మంది ఓటర్లుగా నమోదయ్యారని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా 18 నుంచి 19 సంవత్సరాల మధ్య వారు 26, 059 మంది నూతనంగా నమోదు అయ్యాయన్నారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేసేనాటికి జిల్లాలో 2,013 గృహాల్లో 10 ఓటర్ల కంటే ఎక్కువ నమోదైనట్లు గుర్తించి వాటిని సవరించడం జరిగిందని ఇంకా ఎనిమిది గృహాల్లో 10 ఓట్లపైన ఉన్న వారు ఉన్నారన్నారు. జిల్లాలో 17, 716 ఓటర్ల డిజేబుల్ ఓటర్లుగా నమోదయ్యారని, 801 ఒక్క రివిజన్ సందర్భంగా 5,414 ఫోటోలు సిమిలర్గా ఉండగా 840 ఫోటోలు ఒకే ప్రాంతం లో ఉన్నట్టు జియోగ్రాఫ్లుగా ఉన్నట్టు గుర్తించి వాటిని తీసి వేయడం జరిగిందన్నారు. ప్రత్తిపాడు మండలం గిరిజనాపురం గ్రామానికి సంబంధం చిన 11 కుటుంబాలకు సంబంధించిన 19 మంది గిరిజన ఓటర్లు నూతనంగా నమోదు చేయడం జరిగిందని, గతంలో వీరు ఓటర్లుగా నమోదు కాలేదని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 6, 937 మంది సెక్స్ వర్కర్ల ఓటర్లగా నమోదు చేయడం జరిగిందని, 179 మంది ట్రాన్స్ జెండర్లను ఓటర్లుగా నమోదైనట్లు ఆమె తెలిపారు. జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గత సంవత్సరం అక్టోబర్ 27 నుంచి నేటి వరకు సమావేశాలు నిర్వహించడం జరిగిందని, జిల్లాలో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఒక్కొక్క పోలింగ్ కేంద్రం చొప్పున మొత్తం మూడు పోలింగ్ కేంద్రాలను నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని 1,637 పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు సంబంధించి విద్యుత్, ఫర్నిచర్, టాయిలెట్లు, తాగునీరు, ర్యాంపులను సమకూర్చడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్

ప్రతి సమస్యకూ నాణ్యమైన పరిష్కారం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి ఒక్క సమస్యకూ నాణ్యమైన పరిష్కారం అందిస్తామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రజా సమస్యలపై 13 మంది కమిషనర్‌కు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆయా ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను పరిష్కరించి అందుకు సంబంధించిన సమాచారాన్ని అర్జీదారులకు ఇవ్వాలన్నారు. నగరపాలక సంస్థ వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ 18004255990కు డయల్ చేసి సమస్యలను వివరించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఇ పి.వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఎసిపి నాగశాస్త్రులు, ఎఒ శిరీష్, పలువురు డిఇలు, ఎఇలు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

అరెస్టులు.. గృహ నిర్బంధాలు

- రాత్రంతా చలిలోనే అంగన్‌వాడీల పడిగాపులు

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఉక్కుపాదాన్ని మోపింది. ఇప్పటికే ఎస్మా చట్టాన్ని ప్రయోగించి వారిని భయ పెట్టేందుకు ప్రయత్నించింది. ఉద్యోగాల నుంచి తొలగిస్తామని షోకాజ్ నోటీసులను అందించింది. అయినా అంగన్‌వాడీలు మొక్కవోని ధైర్యంతో తమ పోరాటాన్ని సాగిస్తున్నారు రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాలను సేకరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి సోమవారం అందించాలని చలో విజయవాడకు బయలుదేరారు. అయితే ప్రభుత్వం తన నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తూ అంగన్‌వాడీలపై పోలీసులతో ఉక్కుపాదాన్ని మోపింది. విజయవాడకు బయలుదేరిన అంగన్‌వాడీలను ఎక్కడి కక్కడ అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లకు తరలించారు. ఇంటి వద్ద ఉన్న వారిని గృహ నిర్బాంధానికి పాల్పడ్డారు. **కాకినాడ** అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్న దారుణ దమనకాండను ప్రజలంతా ఖండించాలని అంగన్‌వాడీ వర్కర్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, సిఐటియు నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఒత్తిడులు మధ్య స్థానిక ధర్నా చౌక్ వద్ద అంగన్ వాడీల నిరసన కొనసాగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.రమణమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అరెస్టులు జరుగుతున్నా విజయవాడలో, జిల్లాలో కూడా ఆందోళన సాగిస్తామన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు సమ్మె విరమించబోమన్నారు. సిపి ఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర నాయ కులు సి.వెంకట్రావు, దుంపల ప్రసాద్ తదిత రులు ఆందోళనకు సంఘీ భావం తెలిపారు. ప్రభు త్వం తక్షణమే అంగన్ వాడీల సమ్మె డిమాం డ్సను నెరవేర్చాలని, లేని పక్షంలో ఉద్యమం మరిం త తీవ్రతరం అవుతుం దన్నారు. అధికారానికి వచ్చే ముందు జగన్మోహన్ రెడ్డి నాడు పోలీసు చర్యలను ఖండించిన విషయం గుర్తు లేదా? అని ప్రశ్నించారు. మహిళలపై మగ పోలీసుల దాష్టీకం చూస్తుం టే అన్ని రకాల ప్రజాస్వామిక చట్టాలను తుంగలో తొక్కుతున్నా రని దుయ్య బట్టారు. అరెస్టులు జరుగుతున్నా ఆందోళనలు కొన సాగుతున్న తీరు చూసి ప్రభుత్వం దిగి రావాలన్నారు. ముఖ్యమంత్రి హామీ నిలబెట్టు కోవాలని డిమాం డ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అర్బన్, రూరల్, తాళ్ళ రేవు, కరప, కాజులూరు మండ లాల అంగన్‌వాడీలు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు. **గండేపల్లి** గండేపల్లిలో అంగన్‌వాడీల కోసమే సిఐ లక్ష్మణరావు, జగ్గంపేట, గండేపల్లి ఎస్ఐలు నాగార్జున, ఎన్ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. విజయవాడకు వెళ్లేందుకు బస్సులు, ఇతర వాహనాల్లో వెళ్లే అంగన్‌వాడీలను ఆదివారం అర్ధరాత్రి పోలీసులు అడ్డు కున్నారు. మండలానికి చెందిన అంగన్‌వాడీలను తిరిగి తమ తమ గ్రామాలకు వెళ్లిపోవాలని హుకుం జారీ చేశారు. విజయ నగరం నుంచి ప్రత్యేక బస్సులో వెళ్తున్న 42 మంది అంగన్ వాడీలను అర్ధరాత్రి 2 గంటలకు నిలుపుదల చేసి తహశీల్దార్ కార్యాలయం ఆరుబయటే ఉంచారు. రాతంత్రా చలిలోనే అంగన్‌వాడీలు ఉన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు అంగన్ వాడీలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అంగన్‌వాడీలపట్ల కర్కసంగా వ్యవహరిస్తున్నారని, అర్ధరాత్రి మహిళలను పోలీసు స్టేషన్లలో నిర్బంధించడం దారుణమన్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి జగన్‌ను ఖచ్చితంగా గద్దెదించుతామని హెచ్చరించారు. **తాళ్లరేవు** సోమవారం తెల్లవారుజామున విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీలను కోరంగి పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని కోరంగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గుత్తుల రామలక్ష్మి, దంగేటి సత్యవేణి, కూరాటి పార్వతి, వాడపర్తి దుర్గా మహాలక్ష్మి, పెచ్చెట్టి ఆదిలక్ష్మి, పెయ్యల సుబ్బలక్ష్మిలను మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో విడిచి పెట్టారు.

సామర్లకోటలో ఆదివారం అర్ధరాత్రి ఆటోలు వెళ్తున్న అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గండేపల్లి పోలీస్ పికెట్ వద్ద నడిరోడ్డుపై నిలబెట్టి అంగన్‌వాడీలను ప్రశ్నిస్తున్న పోలీసులు

కాకినాడలో నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్న అంగన్‌వాడీలు

అక్రమ అరెస్టులపై ఖండన

ప్రజాశక్తి - కాకినాడ

నిరవధిక నిరాహార దీక్షలో ఉన్న అంగన్‌వాడీ నాయకులతోపాటు వేలాది అంగన్‌వాడీ కార్యకర్తలను అరెస్టులు చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి వందలాది మంది పోలీసులు అంగన్‌వాడీల నిరసన శిబిరాల్లో వేసిన టెంట్‌లను పీకేసీ మహిళలని కూడా చూడకుండా మగ పోలీసులు అమానుషంగా వ్యవహరించడం దారుణమన్నారు. తక్షణం అరెస్టు చేసిన వారిని విడుదల చేసి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ కార్మిక సంఘం ఖండన

అంగన్‌వాడీలపై పోలీసుల నిర్బంధాన్ని ఆపాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ద్వారా ముందుగా నోటీస్ ఇచ్చి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. 42 రోజులైనా సమస్యను పరిష్కరించకపోవడం అన్యాయం అని విమర్శంచారు. ప్రజల మద్దతుతో జరుగుతున్న ఈ సమ్మెకు, ప్రజలు చేసిన కోటి సంతకాలు తీసుకుని జగనన్నకు చెబుదామని విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి, పోలీస్ స్టేషన్లో పెట్టడం అక్రమమని అన్నారు. తక్షణం ఈ అరెస్టులను ఆపి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని, అందుకు ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

కార్టూన్'నిజం'

రజక వృత్తిని పౌర సేవగా గుర్తించాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రజక వృత్తిని పౌరుసేవగా గుర్తించి రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఇంద్రపాలెం రజక కమ్యూనిటీ హాల్‌లో కొజ్జవరపు నాగేశ్వరరావు అధ్యక్షతన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడిచిన నేటికీ రజకులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడి ఉన్నారన్నారు. ఏ ప్రభుత్వాలు వచ్చినా రజకులు అభివృద్ధికి నోచుకోవడం లేదని అన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న రజక వృత్తిని ప్రభుత్వం పౌరుసేవ వృత్తిగా గుర్తించడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో రజకులకు చేసింది ఏమీ లేదన్నారు. రజక వృత్తిదారులకు స్టీమ్ ఐరన్ ఇస్త్రీ చేసేందుకు 250 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ సంస్థలు, దేవస్థానాల్లో ఉన్న రజక వృత్తి ఉపాధిని రజక కుటుంబాల్లో ఉన్న యువతి యువకులకు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కోనేటి రాజు మాట్లాడుతూ.ఫిబ్రవరి 9నకాకినాడలోని యుటిఎఫ్ భవన్లో 6వ జిల్లా మహాసభలు జరుగనున్నాయని, ఈ మహాసభలో రజకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కొజ్జవరపు మాణిక్యం, పోలుపల్లి శ్రీనివాసులు, శిలా అర్జున్ రావు, కొమరం పూరి వీరబాబు, వాలపల్లి గంగాధర్ రావు, పెద్దపూడి చంటి, కొమరం సూరిబాబు, మహిళా నాయకులు మంగ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నన్నయ విద్యార్థికి రీసెర్చ్ ఫెలోషిప్

విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజనీతి ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగ విద్యార్థి రేపు బాల జయదీప్ యుజిసి ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ సాధించాడు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచిన రాజనీతి శాస్త్ర విద్యార్థి జయదీప్ ను ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.ప్రశాంతి శ్రీ, కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.జోసెఫ్ స్టీఫెన్, విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ ఎం.నాని బాబు, డాక్టర్ కె.హరి బాబు, డాక్టర్ ఎం.గోపి, ఎస్ఎఫ్ఎ జిల్లా అధ్యక్షుడు వరహాలు, జూనియర్ అసిస్టెంట్ ఎం.లలిత, విభాగ విద్యార్థినీ, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా జయదీప్ మాట్లాడుతూ సివిల్స్ సాధించడమే నా లక్ష్యమని తెలిపారు. జయదీప్ తండ్రి డాక్టర్ బివి.నారాయణస్వామి స్థానిక రంగరాయ మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను చెల్లిం చాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉపాధ్యాయులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఉప్పాడ బస్‌స్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్.సూరిబాబు, కాకినాడ జిల్లా ప్రధానకార్యదర్శి టి.రవిచక్రవర్తి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించలేని పరిస్థితికి దిగజారిపోయిందన్నారు. జీతం వస్తుందో లేదో అనే పరిస్థితిలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వం జీతాలను సక్రమంగా వేయకపోవడం వల్ల తీసుకున్న రుణాలకు అపరాధ రుసుంను చెల్లించాల్సి వస్తుందన్నారు. పిఆర్‌సి, డిఎ అరియర్లు రూ.12 వేల కోట్లు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ బకాయిలు రూ.1500 కోట్లు, సరెండర్ లీవ్ బకాయిలు రూ.4500 కోట్లు మొత్తంగా రూ.18 వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సిహెచ్.సూరిబాబు, షేక్ రహిమాన్ బీ, టి.సీతారామయ్య, కుటుంబ సంక్షేమ పథకం బాధ్యులు ఎ.సీతారామరాజు, వి.పాములయ్య, పిఠాపురం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, ఎన్.శ్రీనివాసరావు, గొల్లప్రోలు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరరావు, ఎంవి.సత్యనారాయణ, యు.కొత్తపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రాజు, తేజ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ముద్రగడ ఎంట్రీకి బ్రేక్..?

-చంద్రబాబు పల్లకి మోసేందుకు నో
-పవన్ కు సీఎం పదవి ఇస్తేనే మద్దతిస్తా

ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి

కాపు ఉద్యమ నేత ముద్రగడ ఊహించని షాక్ ఇచ్చారు. ముద్రగడ వైసిపిలో చేరుతారనే ప్రచారం వేళ టిడిపి, జనసేనలో టెన్షన్ మొదలైంది. దీంతో మధ్యవర్తులను రంగంలోకి దించింది. ముద్రగడను తమ పార్టీలోకి రావాలని జనసేన నేతలు ఆహ్వానించారు. కాపులంతా కసిగా కట్టుగా ఉండాలని పవన్ చెప్పటం తనకు నచ్చిందని, జనసేనలోకి రావాలని పవన్ కోరితే ఆలోచన చేస్తానని ముద్రగడ చెప్పారు. పవన్ స్వయంగా తానే ముద్రగడను ఆహ్వానిస్తారంటూ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు. ముద్రగడ, ఆయన కుమారుడుకు సీటు గురించి ప్రతిపాదనలు తెర మీదకు వచ్చాయి. ఇంతలో చంద్రబాబుతో పొత్తుతో ఉండటంతో పవన్‌కు సిఎం పదవిపైన నిర్ణయం ఏంటని ముద్రగడ స్పష్టత కోరారు. దీంతో ప్రస్తు తానికి ముద్రగడ జనసేనలోకి చేరే దుకు బ్రేక్ పడినట్లు సమాచారం. చంద్రబాబు నుంచి దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి హామీ లేదని జనసేన నేతలు క్లారిటీ ఇచ్చారు. పవన్ ఆలోచన గురించి ఆరా తీశారు. పవన్ ఆలోచన ఏంటో పార్టీ నేతలు వివరించారు. దీంతో ముద్రగడ ఏకీభవించలేదు. కాపుల ఐక్యంగా పని చేసే పొత్తు ధర్మంలో భాగంగా టిడిపి అభ్యర్థులకు సహకరిస్తున్న అంశాన్ని గుర్తు చేస్తున్నారు. గెలిచిన తరువాత అధికారం మాత్రం కాపులకు లేకుండా చంద్రబాబుకే దక్కాలంటే అందుకు పని చేసేందుకు తాను సిద్దంగా లేనని ముద్రగడ తేల్చి చెప్పారని జనసేన నుంచి అందుతున్న సమాచారం. ముద్రగడకు సీటు విషయంలోనూ చంద్రబాబుతో చర్చించి చెబుతానని పార్టీ నేతలు చెప్పటం ముద్రగడ ఆగ్రహం తెప్పించింది. అన్నింటికీ చంద్రబాబు పైనే ఆధారపడితే ఇక మీకు పార్టీ ఎందుకని ముద్రగడ ప్రశ్నించినట్లు సమాచారం. పవన్ కల్యాణ్‌కు ఎన్ని సీట్లు ఇస్తారని ముద్రగడ తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలోనూ స్పష్టత లేదని నేతలు సమాధానం ఇచ్చారు. అసలు ఏ ప్రాతిపదికన టిడిపికి మద్దతిస్తున్నారంటూ ముద్రగడ ప్రశ్నించినట్లు సమాచారం. దీనికి మధ్యవర్తులు, జనసేన నేతల నుంచి సమాధానం రాలేదు. కాపులు కలిసి కట్టుగా ఉండాలని పవన్ చెబుతున్నది చంద్రబాబు పల్లకి మోయటానికి అంటూ ముద్రగడ సీరియస్ గా రియాక్ట్ అయ్యారని ప్రత్యక్ష సాక్షుల సమాచారం. దీంతో అన్ని విషయాలు పవన్ వస్తే ఆయనతోనే మాట్లాడుతానని ముద్రగడ తేల్చారని తెలుస్తోంది. పవన్ గౌరవిస్తూనే ..సిఎం పదవిలో పవన్‌కు షేరింగ్ ఉంటేనే తాను జనసేనలో చేరి గెలుపు కోసం పని చేస్తానని.. పవన్‌కు సీఎం పదవి లేకుంటే తాను చేరేది లేదని ముద్రగడ తేల్చేసిన అంశం ఇప్పుడు జనసేనలో హాట్ టాపిక్ గా మారింది.

నేరాలు ఘోరాలు

మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్న అధికారులు

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

ఫైబర్ బోటులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బలుసుతిప్పలో గోదావరి నది పాయలో ఫైబర్ బోటులో నిల్వ ఉంచిన 1,079 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.లక్షా 25 వేల విలువ ఉంటుందని చెప్పారు. అక్రమ మద్యాన్ని నిల్వ ఉంచిన బోటు ఎవరిది, ఎవరు నిల్వ చేశారో దర్యాప్తు చేస్తున్నామని ముమ్మిడివరం సిఐ కొండయ్య తెలిపారు. యానాం నుంచి ఎవరైనా పెద్ద మొత్తంలో మద్యాన్ని కొనుగోలు చేసి సరఫరా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, యానాం షాపులలో చట్టపరంగా కాకుండా ఎక్కువ మొత్తంలో అక్రమంగా మద్యాన్ని అమ్మినట్లయితే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని సెబ్ ఎస్.ఐ రాజేష్ హెచ్చరించారు.

1,398 మద్యం బాటిళ్ల స్వాధీనం

ప్రజాశక్తి – తాళ్లరేవు

అక్రమంగా యానాం నుంచి మద్యం తీసుకువచ్చి అమ్ముతున్న ఒకరిని అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించినట్లు కోరంగి ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని కోరంగి పంచాయతీ చిన్న బొడ్డు వెంకటాయపాలెంలో అక్రమంగా నిల్వ ఉంచి అమ్మకానికి సిద్ధంగా ఉన్న 1398 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని గ్రామానికి చెందిన పెకింగి దుర్గను అరెస్టు చేసి కేసు నమోదు చేసి కాకినాడ కోర్టుకు తరలించారు.

లారీని ఢీకొన్న వ్యాన్

ప్రజాశక్తి – గోపాలపురం

లారీ బ్రేక్ వేయడంతో ఐషర్ వ్యాన్ అదుపుతప్పి లారీని ఢీకొంది. ఆదివారం అర్ధరాత్రి గోపాలపురం శివారు దుర్గమ్మ గుడి సమీపంలో గీ ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి కలకత్తాకు పైపులు లోడుతో ఐషర్ వ్యాన్ బయలుదేరింది. గోపాలపురం శివారు దుర్గమ్మ గుడి సమీపంలో వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న వ్యాన్ లారీ వెనకవైపు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

గ్యాస్ సిలెండర్ల స్వాధీనం

ప్రజాశక్తి – సామర్లకోట రూరల్

మండలంలోని పలు హోటల్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లలో వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్లను ఉపయోగిస్తుండటంతో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండల సివిల్ సప్లై అధికారి కీర్తి ఆధ్వర్యంలో సోమవారం అధికారులు పలు హోటల్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు హోటల్ లో కమర్షియల్ సిలిండర్ లకు బదులుగా డొమెస్టిక్ సిలిండర్ లు వాడుతున్నట్లు గుర్తించి వ్యాపారుల వద్ద నుంచి 7 డొమెస్టిక్ సిలిండర్ లను సీజ్ చేసి హోటల్ నిర్వాహకులపై 6(ఎ) కేసులను నమోదు చేశారు. ఈ దాడుల్లో సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక హత్య కేసులో తల్లికి శిక్ష

ప్రజాశక్తి – కాకినాడ

బాలిక హత్య కేసులో నేరం రుజువు కావడంతో సవతి తల్లికి కాకినాడ 4వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. కాకినాడ వన్ టౌన్ ఎస్‌హెచ్ఒ. వి.సురేష్ బాబు వెల్లడించిన వివరాల ప్రకారం...2019 నవంబర్ 22న జగన్నాధపురంలోని నేతాజీ మునిసిపల్ స్కూల్లో రెండవ తరగతి చదువుతున్న సూరాడ దీప్తి అనే అమ్మాయిని సవతి తల్లి సూరాడ శాంతి కుమారి స్కూల్ నుంచి ఇంటికి తీసుకువెళ్లి టవల్‌తో పీక బిగించి హత్య చేసింది. అనంతరం ఇంద్ర పాలెం బ్రిడ్జి నుంచి ఉప్పుటేరు కాలువలో విసిరేసింది. దీప్తి తండ్రి సత్య శ్యాంకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వన్ టౌన్ ఎస్ఐ సుప్రియ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ పూర్తయిన అనంతరం చార్జిషీటు న్యాయస్థానంలో ఫైల్ చేశారు. సాక్షుల విచారణ, వాదోపవాదనలు విన్న అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయి సూరాడ శాంతి కుమారికి సోమవారం యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతి కుమారి వాదనలు వినిపించారు. ఈ కేసులో ముద్దాయిని అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన పోలీసులను డిఎస్‌పి పి.మురళీకృష్ణారెడ్డి, ఇతర అధికారులు ఎస్‌పి అభినందించారు.

విద్యుదాఘాతంతో లైన్‌మేన్ మృతి

ప్రజాశక్తి – మామిడికుదురు

గోగన్నమఠంలో సోమవారం సాయంత్రం విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌తో లైన్‌మేన్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎలక్ట్రికల్ లైన్‌మేన్ నాంధ్ర రాంబాబు (46) విద్యుత్ మరమ్మతులను పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే చనిపోయినట్లు స్థానికులు నగరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాంబాబు మృతితో వాకలగరువులో విషాద ఛాయలు చోటు చేసుకున్నాయి. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరు ముగ్గురు సోదరులు కాగా ఇటీవలే మూడో సోదరుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం నిర్ఘాంతపోయింది. ఇటీవల పాశర్లపూడిలో విద్యుత్ మరమ్మతులు చేస్తూ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన మరువక ముందే ఈ సంఘటన చోటు చేసుకోవడంతో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి – కాకినాడ

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

యుటిఎఫ్ పిలుపు మేరకు జిల్లా పరిషత్ సెంటర్ నుంచి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు నగేష్ అధ్యక్షతన భారీ ర్యాలీ నిర్వహించారు. ఎపిజిఎల్ఐ బుణాలు, పిఆర్‌సి బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు వెంటనే చెల్లించాలని జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఐ.ప్రసాదరావు డిమాండ్ చేశారు. జిల్లా కుటుంబ సంక్షేమ పథకం ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు స్లోగన్స్ ఇస్తూ ప్రభుత్వ ఉదాసీనత వైఖరిని ఖండించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షుడు రమణ, నాగమణి, కరప, కాజులూరు, తాళ్ళరేవు, కాకినాడ అర్బన్, రూరల్ ఉపాధ్యాయులు సుమారు 200 మంది ర్యాలీ లో పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి – పిఠాపురం

దీక్ష చేస్తున్న న్యాయవాదులు

ప్రజల ఆస్తి హక్కును హరించే ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం రిలే నిరాహార దీక్షలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్..భాస్కరాచార్యులు, న్యాయవాదులు ఐఎ.పాషా, దల్లి శ్రీనివాస్ తదితరులు కూర్చున్నారు. దీక్షల ప్రారంభించిన బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రాజా రావు, ఉపాధ్యక్షులు ఎస్ఎం.అలీ మాట్లాడారు. 55 రోజుల పైబడి న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం బాధాకమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బంగారు రామకృష్ణ, కెకెఎస్ఎన్.సురేష్, వి.అచ్యుత్ కుమార్, ఉదయభాస్కర్, సురవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

24న జరిగే బంద్‌కు సహకరించాలి

ప్రజాశక్తి – తాళ్ళరేవు

అంగన్‌వాడీలకు మద్దతుగా రాజకీయ పార్టీల నాయకులు

అంగన్‌వాడీలపై అణిచివేతకు నిరసనగా ఈ నెల 24న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రజలందరూ సహకరించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వర రావు విజ్ఞప్తి చేశారు. అన్ని రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు పూర్తి మద్దతునిచ్చి మండలంలో జయప్రదం చేయడం కోసం సోమవారం అంగన్‌వాడీల సమ్మె శిబిరం వద్ద సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అవలం బిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 24 బుధవారం జరుగుతున్న బందును మండలంలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు వళ్ళు రాజుబాబు, టి.లక్ష్మణరావు, కట్ట త్రిమూర్తులు, వడ్డి ఏడుకొండలు, వీరబాబు, విప్పర్తి శ్రీనివాసరావు, దుప్పి అదృష్ట దీపుడు, ఎం. తణుకు రాజు, సుందరపల్లి సత్య నారాయణ, ఈశ్వరి బాయి, పాల్గొన్నారు.

అందరివాడు అంబేద్కర్

ప్రజాశక్తి – గండేపల్లి

జైభీమ్ యూత్ సభ్యులు

అందరివాడు భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అని మురారి గ్రామ యువ నాయకుడు జాస్తి వసంత్ అన్నారు. ఇటీవల విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ అంబేద్కర్ విగ్రహాన్ని చూసేందుకు గండేపల్లి మండలం మురారి గ్రామానికి చెందిన జై భీమ్ యూత్ సభ్యులను తీసుకుని వసంత్ సోమవారం విజయవాడ వెళ్లారు. ఈ సందర్భంగా వసంత్ మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం బడుగు బలహీన వర్గాలకే కాకుండా, దేశంలోని ప్రతీ ఒక్కరికి ఆదర్శం అని, ఆయన్ని ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మురారి గ్రామ జై భీమ్ యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తికి నివాళి

గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి – కాకినాడ రూరల్

బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామ్మూర్తి వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ ఆంధ్రదేశంలో వ్యవహారిక భాష ఉద్యమానికి పితామహుడు గిడుగు రామ్మూర్తి అని అన్నారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి నిత్య వ్యవహారిక భాషలో ఉన్న అందాన్ని, విలువను తెలియచెప్పిన మహనీయుడు గిడుగు అని అన్నారు. తెలుగు భాష సేవకే తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. 1940 జనవరి 22న ఆయన శ్రీకాకుళంలో కాలం చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, రవివర్మ, కాళిదాసు పాల్గొన్నారు.

లెనిన్ మార్గం అనుసరణీయం

ప్రజాశక్తి – కాకినాడ రూరల్

సభలో మాట్లాడుతున్న పూర్వ అధ్యాపకులు కృష్ణారావు

లెనిన్ మార్గం అనుసరణీయమని పూర్వ అధ్యాపకులు కట్టా కృష్ణారావు అన్నారు. రూరల్ మండల సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో ఇంద్రపాలెంలో లెనిన్ శత వర్ధంతి సభ పెద్దింశెట్టి రామకృష్ణరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రష్యా విప్లవ నాయకుడు, మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త, మార్క్సిజాన్ని ప్రపంచంలో మొదటిసారి అన్వయించి రష్యాలో విప్లవం సాధించిన మహా నేత లెనిన్ అని కొనియాడారు. మార్క్సిజం ప్రపంచ మానవుల విముక్తి సిద్ధాంతమని, దాన్ని అధ్యయనం చేసి ఇది సరైన సిద్ధాంతం అనిరూపించిన.మహాశయుడు లెనిన్ అని అన్నారు. లెనిన్ ఒక రష్యాకు మాత్రమే చెందిన నేత కాదని, ప్రపంచ మానవాళికి విముక్తి మార్గాన్ని చూపి అమలు చేసిన మహా మేధావి, కార్య దీక్షాపరుడని తెలిపారు. సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ నేటి తరానికి విజ్ఞానాన్ని అందించేందుకు స్టడీ సెంటర్ ప్రారంభం కావడం అభినందనీయమన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సిపిఎం నాయకులు, అమరజీవి వాసంశెట్టి సూర్యారావు స్మారకంగా 'విఎస్ఆర్ ఐడియల్ స్టడీ సెంటర్'ను శ్రామికులైన గుత్తుల రామకృష్ణ, మట్టా హరినాథ్, అనపర్తి ఏడుకొండలు, సోనీ, కుమారి, తేజ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టడీ సెంటర్ కన్వీనర్ సిహెచ్.కిరణ్‌కుమార్ మండల కమిటీ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు, వి.చంద్రావు, ఆర్‌పిఐ నాయకులు ఎ.రామేశ్వరరావు, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు ప్రభాకర్ వర్మ, సైన్స్ ఉద్యమ నాయకులు వర్మ, ఉద్యోగ సంఘాల నాయకులు రవికుమార్, చెల్లారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, ఇంద్రపాలెం సిపిఎం కార్యదర్శి సిహెచ్. విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చిత్తడి నేలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి – కాకినాడ

చిత్రలేఖనం పోటీలను పరిశీలిస్తున్న భరణి

చిత్తడి నేల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా అటవీ సంరక్షణ అధికారిణి ఎస్.భరణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్‌కోర్, పాఠశాల విద్యాశాఖ, అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్ శాఖా గ్రంథాలయం (వివేకానంద పార్క్)లో చిత్తడి నేల సంరక్షణపై జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 23 పాఠశాల నుంచి 114 మంది విద్యార్థులు హాజరయ్యారు. చిత్తడి నేలలు, వాటి యొక్క సంరక్షణపై చిత్రాలను విద్యార్థులు చిత్రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తడి నేలలు, మడఅడవులను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. జీవితంలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే పర్యావరణ పరిరక్షణలో పెద్ద ఫలితాలను పొందవచ్చన్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్‌ను నిషేధించుకోవాలన్నారు. మొక్కలు పెంచడం జీవితంలో ఒక భాగంగా కావాలన్నారు. మడ అడవులు కాకినాడ పరిసర ప్రాంతాలను తుఫానుల బారి నుంచి కాపాడుతున్నాయని, అటువంటి మడ అడవులను రక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ చిత్తడి నేలల సంరక్షణ, అవగాహన పరిరక్షణ, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ ఎం.శ్రీనివాసరావు, అటవి క్షేత్రధికారి ఎస్ఎస్ఆర్.వరప్రసాద్, నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త కెవికె.మహేశ్వరరావు, చిన్నబాబు, రమణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదల కోసమే అన్నా క్యాంటీన్

ప్రజాశక్తి – జగ్గంపేట రూరల్

అవసరార్థుల కోసమే గత ప్రభుత్వం అన్నా క్యాంటీన్‌లను ఏర్పాటు చేసిందని, రాబోయే టిడిపి, జనసేన ప్రభుత్వంలో అన్నా క్యాంటీన్‌లను తిరిగి ప్రారంభిస్తామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌లో అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్య దొర ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో ఆయన అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, దాపర్తి సీతారామయ్య, చాగంటి సత్యనారాయణమూర్తి, నండ్ల చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి యాప్ టాపర్లకు ప్రశంసలు

ప్రజాశక్తి – తాళ్ళరేవు

టిడిపి అధికార యాప్ 'మన టిడిపి' పట్ల ప్రజలలో అవగాహన కల్పించి ముమ్మిడివరం నియోజకవర్గంలో మొదటి ఆరు స్థానాలలో నిలిచిన నాయకులను ముమ్మిడివరం టిడిపి ఇన్‌ఛార్జ్ దాట్ల సుబ్బరాజు ప్రశంసించారు. టిడిపి రాష్ట్రకార్యాలయం నుంచి పంపించిన టిడిపి జెండా స్టాండ్‌లను సోమవారం దాట్ల సుబ్బరాజు తాళ్ళరేవులో అందజేశారు. నియోజకవర్గం మొత్తం మీద 8 మంది సభ్యులు ఉండగా అందులో తాళ్ళరేవు మండలం నుంచే 6గురు సభ్యులు ఉన్నారు.

'ఎస్మా'ను తొలగించి రాజీ చర్చలు చేపట్టాలి

ప్రజాశక్తి – కాకినాడ

అంగన్‌వాడీలపై ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకుని వారి ఉద్యమ విరామానికి రాజీచర్చలు చేపట్టాలని పౌరసంక్షేమ సంఘం ప్రజాహితాన్ని కోరింది. ప్రజాస్వామిక పోరాటంలో ప్రభుత్వం ఉద్యమ పక్షం సానుకూల ధోరణిగా వ్యవహరించడం వలన ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజల మద్దతు కోసం డిమాండ్ల పరిష్కార సాధనపై రాజీ చర్చలు జరిపి ఉద్యమ విరామానికి శ్రేయస్కరం కావాలని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంలో ప్రభుత్వం భేషజాలకు తావులేకుండా ఓ మెట్టు దిగిరావాలన్నారు.

అభివృద్దే ధ్యేయంగా చంద్రబాబు ప్రణాళికలు

ప్రజాశక్తి – గండేపల్లి

రాష్ట్రాభివృద్దే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని జెడ్ రాగంపేటలో సోమవారం కంటే సురేంద్ర ఆధ్వర్యంలో వైసిపి నుంచి టిడిపిలోకి పలువురు చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాక్షస పాలన అంత మొందించే లక్ష్యంతో టిడిపి, జనసేన పార్టీల కలయికతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహన్ రావు, కొత్త కొండ బాబు, మారిశెట్టి భద్రం, యర్రంశెట్టి బాబ్జి పాల్గొన్నారు.

వినూత్న పద్ధతులను అనుసరించాలి

ప్రజాశక్తి – పెద్దాపురం

వినూత్న వ్యవసాయ పద్ధతులను ఎప్పటికప్పుడు అవలంభించాలని పార్వతీపురం ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి.ప్రసన్నకుమార్ సూచించారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో సోమవారం జరిగిన రైతు సదస్సు స్థానిక ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జానకి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచుకోవడం ద్వారానే రైతులు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ సదస్సులో అసోసియేట్ రిప్రజెంటేటివ్ అరుణకుమారి, సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, ఎంపిటిసి సభ్యులు నల్లల సూర్యకుమారి, గోవిందు, పెంటా విజయ్ కుమార్, జీను వెంకటరమణ, భూషణం, కట్టమూరు పంచాయతీ సెక్రెటరీ రాధాకృష్ణ, సొసైటీ సిఇఒ ఆచార్యులు, ఎం.చిలకమ్మ, కె.అమృత, సిహెచ్.విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు చేయూత

ప్రజాశక్తి – జగ్గంపేట రూరల్

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మానవ హక్కుల సంఘం ఆర్థిక సాయాన్ని సోమవారం అందించింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు నూతనపాటి అప్పలకొండ మాట్లాడుతూ ఇలాంటి బాధితులను సహృదయంతో అందరూ ఆదుకోవాలని, వీరితో మంచి స్నేహ భావంతో కలిగి ఉండాలన్నారు. అనంతరం బాధితులకు బియ్యం, కిరాణా, పోషక – ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. దీనిలో సహకరించిన సంఘ సభ్యులు రాణి, హేమలక్ష్మి, సంఘ అధికార ప్రతినిధులు పిట్టా అప్పారావు, కాశి చంద్రావతిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో నానిబాబు, వల్లీ భాష, పద్మలత, సాస్ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న వారికి ఆపన్నహస్తం

ప్రజాశక్తి – కరప

మందులు తీసుకున్న బాధితులు

కష్టాల్లో ఉన్న వారికి ఆపన్న హస్తం అందించడంలో కెటిసి, ఎస్‌బిసి విద్యాసంస్థల ఫౌండర్ కిరణ్ కుమార్ మరోసారి తమ ఉదారతను చాటుకున్నారు. కరప మండలం గురజానపల్లి గ్రామంలోని కడు పేద కుటుంబానికి చెందిన పెంకే శ్రీను అనే వ్యక్తి సాధారణ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నారు. సదరు వ్యక్తి కిడ్ని సంబంధిత వ్యాధితో బాధపడుతూ 12 సంవత్సరాలుగా డయాల్సిస్ చేయించుకుంటున్న విషయం తెలుసుకున్న కిరణ్‌కుమార్ తన వంతు సాయంగా బాధిత యువకుడికి నెల రోజులకు సరిపడా మందులు అందజేశారు. అంతేకాకుండా ప్రతి నెలా తమ ట్రస్ట్ ద్వారా మందుల నిమిత్తం తమ సహకారం అందిస్తామని హామీఇచ్చారు. కష్ట కాలంలో తమను ఆదుకున్న కిరణ్ కుమార్ కి బాధిత యువకుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపిలోకి వైసిపి సర్పంచ్

సర్పంచ్‌కి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామకృష్ణుడు

ప్రజాశక్తి – కోటనందూరు

కాకరపల్లి గ్రామానికి చెందిన వైసిపి సర్పంచ్ బంటుపల్లి వెంకటేశ్వరరావు ఆయన అనుచరులు, వార్డు నెంబర్లు కీర్తి రాము, కీర్తి సత్తిబాబు, సంపంగి తాతీలు, పెనుమచి గణేష్, భవన కార్మికుల నాయకులు కుంకుపొడి వీరబాబు, తుని రూరల్ ప్రాంతమైన ఎన్ఎస్ వెంకటనగరం గ్రామానికి చెందిన పలువురు సోమవారం తేటగుంట టిడిపి కార్యాలయంలో పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు పాలల్లో మళ్ళీ అధికారం చేపట్టడం జరుగుతుందని, తునిలో యనమల దివ్య విజయం సాధిస్తుందని అన్నారు. జగన్ ప్రభుత్వం పై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు, మోతుకూరు వెంకటేష్, దంతులూరి చిరంజీవ రాజు, అంకమ్మరెడ్డి బుల్లి బాబు, గాడి రాజబాబు, అంకమరెడ్డి రమేష్, సామినేడి కృష్ణార్జున, నెమ్మది సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

ఆదిత్య ఫార్మసీలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి – గండేపల్లి

సూరం పాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాల ప్రథమ సంవత్సరం బి.ఫార్మసీ మరియు ఫార్మా –డి విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జెఎన్‌టియుకె ప్రొఫెసర్. డాక్టర్ కెవిఎస్‌జి.మురళీకృష్ణ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వృత్తిపరమైన కోర్సుల పట్ల సరైన అవగాహన కలిగి ఉండాలని, నిరంతరం లక్ష్యం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చిన విద్యార్థులకు నాణెం, పుస్తకాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.సతీష్‌కుమార్, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు..

భీమన కుటుంబ సభ్యులు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి – జగ్గంపేట రూరల్

జగ్గంపేటకు చెందిన భీమన వారి కుటుంబ సభ్యులు సోమవారం టిడిపిలో చేరారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో వారు వైసిపికి రాజీనామా చేసి సుమారు 30 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ జగ్గంపేటలో రాజకీయ చైతన్యం కలిగిన కుటుంబం ఏ పార్టీని నమ్ముకుంటే ఆ పార్టీకి కష్టపడి పని చేసే భీమన వారి కుటుంబం టిడిపిలో చేరడం ఆనందకరమని అన్నారు. ఈ సైకో జగన్ రెడ్డి నిరంకుశ పాలనకు వ్యతిరేకిస్తూ ఇలా అనేక కుటుంబాలు ఆ పార్టీని వీడి టిడిపిలో చేరుతున్నాయని, రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణి బాబు, బద్ది సురేష్, భీమన శ్రీను, భీమన వీరబాబు, భీమన స్వామి, భీమన శివ, శివ, తదితరులు పాల్గొన్నారు.

In the Court of the Prl. Junior Civil Judge, Rajahmundry
O.S. 194/2015

Between:
Y.Atchamma (died) and Others ...*Plaintiffs*
AND
S.Nageswara Rao and Others ...*Defendants*

D-4: Vattikuti Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.
D-5: Vattikuti Ajay, S/o. Venkata Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.
D-6: Vattikuti Sowmya, D/o. Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

పై నెంబరులో మీకు శ్రీ కోర్టు వారు ది. **30-1-2024 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

వాది తరపు అడ్వకేట్స్
G.SRINIVASULU REDDY
K.V.N.BHOTLU
Advocates, Rajahmundry

In the Court of the Prl. Junior Civil Judge, Rajahmundry
O.S. 195/2015

Between:
Yeluri Venkata Ramana @ Venkata Lakshmi ...*Plaintiff*
AND
S.Nageswara Rao and Others ...*Defendants*

D-4: Vattikuti Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.
D-5: Vattikuti Ajay, S/o. Venkata Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.
D-6: Vattikuti Sowmya, D/o. Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

పై నెంబరులో మీకు శ్రీ కోర్టు వారు ది. **30-1-2024 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

వాది తరపు అడ్వకేట్స్
G.SRINIVASULU REDDY
K.V.N.BHOTLU
Advocates, Rajahmundry

In the Court of the Prl. Junior Civil Judge, Rajahmundry
O.S. 196/2015

Between:
Yeluri Kameswari ...*Plaintiff*
AND
S.Nageswara Rao and Others ...*Defendants*

D-4: Vattikuti Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.
D-5: Vattikuti Ajay, S/o. Venkata Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.
D-6: Vattikuti Sowmya, D/o. Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

పై నెంబరులో మీకు శ్రీ కోర్టు వారు ది. **30-1-2024 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

వాది తరపు అడ్వకేట్స్
G.SRINIVASULU REDDY
K.V.N.BHOTLU
Advocates, Rajahmundry